International Journal for Multidisciplinary Research (IJFMR)

E-ISSN: 2582-2160 ● Website: www.ijfmr.com ● Email: editor@ijfmr.com

# Introduction of Drama
# నాటక పరిచయం

**Dr. Bashetty Latha**

Lecturer, Telugum, Kurnool. A.P.

నాటక శబ్దం – ఆవిర్భావం :

నాటకమనే పదం "నట్" అనే మూలధాతువు నుండి ఏర్పడింది. ఈ నట్ ధాతువు ప్రాకృత రూపమని పండితులు భావిస్తున్నారు. వేదకాలం నుండి ఈ నట్ ధాతువు కనపడుతున్నా 'వ్యాపించు' అనే అర్థంలోనే ఆకాలంలో వాడబడింది. నట్ ధాతువు నుండి నాట్యం, నటనం, నటుడు అనే పదాలు ఏర్పడ్డాయి. మనదేశంలో నాటక రచన ఎప్పుడు ఏర్పడిందో చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు ఇప్పటి వరకు లభించలేదు.

నాటకలక్షణాలు :

ఆధునిక తెలుగు నాటకం 1860 లో ఆవిర్భవించేనాటికి అది సంస్కృత నాటక లక్షణాలతో సమన్వయించే దశలో ఉంది. అంటే పంచసంధియుతమై ధీరోదాత్తాది నాయకలక్షణాలు కలిగి ఉండి వీర, శృంగార రసాలలో ఏదో ఒకటి ప్రాముఖ్యం వహించి, గద్యపద్యాత్మకమైన రచన.

అయితే తర్వాత కాలంలో, పాశ్చాత్య నాటక ప్రభావం వల్ల తెలుగు నాటక లక్షణాలు, రూపురేఖలు మారి, ఆధునిక రూపాన్ని సంతరించుకున్నాయి. 1893 లో గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటకంలో రూపపరంగానూ, వస్తుపరంగానూ తెలుగు నాటకం ఆధునికతను సంతరించుకుంది. ఈ ఆధునికత వల్ల నాటకంలో సంస్కృత నాటక సంప్రదాయం తగ్గి పాశ్చాత్య నాటక ప్రభావం పెరిగి, ఈనాటి నాటక లక్షణాలుగా రూపుదిద్దుకొన్నవి. ఇవి నాటకావిర్భావ దశలోనే రూపొందాయి. అవి:

1) నాటకంలో వస్తువు సమకాలీన సమాజానికి సంబంధించిన సమస్యల చిత్రణే అయింది.
2) పాశ్చాత్య మర్యాదననుసరించి రంగవిభజన (Acts), దృశ్యవిభజన (Scene) నాటక పరిణామక్రమాన్ని నిర్దేశించేవిగా ఏర్పడ్డాయి.
3) సులభ వచనశైలి, పాత్రోచిత భాష ప్రయోగింపబడ్డాయి.
4) విషాదాంతాలు, మోదాంతాలు అనే పాశ్చాత్య విభజన తెలుగు నాటకాలకు విస్తరించింది.
5) సామాన్య మానవుడే కథానాయకుడయ్యాడు.

**తెలుగు నాటక వికాసం :**

డా॥ పి.యస్.ఆర్. అప్పారావు, తెలుగు నాటకరంగ చరిత్రలో ఈ క్రింది దశలను పేర్కొన్నారు.

1) 1880-1886 ఆరంభదశ

2) 1886-1910 వికాసదశ

3) 1910-1929 స్వర్ణయుగం

4) 1929-1943 సంధియుగం

5) 1943-1970 పోటీల యుగం

6) 1970-నేటి వరకు - సమకాలీన యుగం

ఆయాకాలాలలో వెలువడిన నాటకాల ప్రామాణికతను ప్రాశస్త్యాన్నీ, ప్రాచుర్యాన్నీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు, 1875-1920 నడుమ కాలాన్ని తెలుగు సాహిత్య వికాసంలో “నాటకయుగం”గా పేర్కొనడానికి వీలుంది. ఈనాటికీ ప్రదర్శించిన ప్రతీసారి అశేష ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న గురజాడ అప్పారావు “కన్యాశుల్కం”, వేదం వెంకటరాయ శాస్త్రి “ప్రతాప రుద్రీయము” చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులు “గయోపాఖ్యానం”, బలిజేపల్లి లక్ష్మీకాంతం ‘సత్యహరిశ్చంద్ర’, తిరుపతి వేంకటకవుల “పాండవోద్యోగ విజయం”. ఈ కాలంలో రాసినవే. వీరుకాక, ధర్మవరం రామకృష్ణాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మీనరసింహా రావు ఈ యుగంలోనే అనేక నాటక రచన చేయటంతోపాటు నాటక విమర్శలు కూడా చేశారు.

ఆధునిక తెలుగు నాటకాన్ని వస్తురీత్యా నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు పేర్కొన్నారు.

1. విషాదాంత నాటకాలు
2. విషాద గంభీర నాటకాలు
3. సంప్రదాయ నాటకాలు
4. సాంఘిక సమస్యా నాటకాలు

**1) విషాదాంత నాటకాలు :**

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో ఆవిర్భవించిన ప్రక్రియ విషాదాంత నాటకం. క్రీస్తు పూర్వం గ్రీకు సాహిత్యంలోనూ, 16 శతాబ్దిలో షేక్స్పియర్ కారణంగా ఆంగ్ల సాహిత్యంలో అద్భుతమైన సాహిత్య ప్రక్రియగా భావింపబడిన విషాదాంత నాటకం 19వ శతాబ్దికే తెలుగు నాటక కర్తలను ఆకర్షించింది.

సహజంగా నాయకుడెంత ఉన్నతుడైనా, ఉదాత్తుడైనా అతనిలో ఉండే ఒకానొక బలమైన లోపం (Tragic flaw) వల్లనో విధి వైపరిత్యం వల్లనో తన నాశనానికి తానే కారకుడై, సామాజికులలో తనపట్ల విపరీతమైన సానుభూతిని కలిగించుకుని, వారిని తనతో పాటు అంతర్వేదనకు గురిచేసే కెథార్సిస్‌ను అనుభవానికి అందించటంతో సామాన్యంగా విషాదాంత నాటకాలలో కన్పించే అంశం.

**2) సంప్రదాయ నాటకం :**

సంస్కృత నాటక సంప్రదాయాన్ని అనుసరించేది సంప్రదాయ నాటకం. ఇది రస ప్రధానమైన నాటకం. ఇందులో వస్తువు ప్రఖ్యాతమో మిశ్రమో అయి ఉంటుంది. అది పౌరాణికం గాని, ఐతిహాసికం గాని, చారిత్రకం గానీ, సాంఘికం కానీ కావచ్చు. విషాదాంతం మాత్రం కాదు. విషాదగంభీర నాటక లక్షణాలు ఉంటే ఉండవచ్చును. వస్తు నిర్మాణంలో పంచ సంధులు, విష్కంభాదులు, అంకనిర్మాణం కన్పిస్తాయి. సంప్రదాయ నాటక వస్తువులో కూడా సమస్య ఉండ వచ్చు. కానీ అది కథకు సంబంధించిన సమస్యే అయి ఉంటుంది తప్ప, సమకాలీన సామాజిక సవస్య కానవసరం లేదు. ఈ నాటకం భావ తీవ్రతను పద్యం ద్వారానో, లయాత్మక వచనం ద్వారానో వ్యక్తీకరిస్తుంది. ఉదా॥ తిరుపతి వెంకటకవుల "పాండవోద్యోగ విజయం".

**3) సాంఘిక సమస్యా నాటకం :**

ఈ నాటకంలో వస్తువు కల్పితం. దీనిపై పాశ్చాత్య నాటక ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. ఈ నాటకాలు మోదాంతాలు కావచ్చు. విషాదాంతాలు కావచ్చు. సాంఘిక సమస్యా నాటకంలో సజీవ సాంఘిక సమస్యను ఎన్నుకన్నా, దాన్ని నిర్వహించే పద్ధతిలోనూ, సమస్యా పరిష్కారాన్ని సూచించే పద్ధతిలోనూ రచయిత కళాత్మకమైన మార్గాన్నే అనుసరిస్తాడు. కానీ, వాస్తవ జీవితంలో ఆ సమస్యకు పరిష్కారం చేసి చూపించే బాధ్యతను నాటకం ద్వారా ప్రదర్శించడు. సంప్రదాయ నాటకంలో కథ ఏ కార్యంతో మొదలౌతుందో ఆ కార్యం సఫలం కావటంతో తప్పక ముగస్తుంది. అయితే సాంఘిక సమస్యా నాటకంలో ఆరంభించిన కార్యం ముగియాలన్న నియమం లేదు. ఈ నాటకాలలో సామాజికులకూ పాత్రల పట్ల సానుభూతి మాత్రమే ఉంటుంది కానీ, సహానుభూతి సర్వత్రా, సంపూర్ణంగా ఉండదు. సాంఘిక సమస్యా నాటకంలో పాత్రోచితమైన సజీవమైన, వ్యవహారభాష ప్రయోగింపబడుతుంది. ఉదా॥ గురజాడ అప్పారావు కన్యాశుల్కం.

## పాద సూచికలు

1. అభిజ్ఞాన శాకున్తలము, వ్యాఖ్యాత, నోరి బోగేశ్వర శర్మ – పేజి నెం. 74.

2. అభిజ్ఞాన శాకున్తలము, వ్యాఖ్యాత, నోరి బోగేశ్వర శర్మ – పేజి నెం.75.
3. అభిజ్ఞాన శాకున్తలము, వ్యాఖ్యాత, నోరి బోగేశ్వర శర్మ – పేజి నెం.75.
4. అభిజ్ఞాన శాకున్తలము, వ్యాఖ్యాత, నోరి బోగేశ్వర శర్మ – పేజి నెం.75.
5. అభిజ్ఞాన శాకున్తలము, వ్యాఖ్యాత, నోరి బోగేశ్వర శర్మ – పేజి నెం.76.